

18 ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరు

కులకచర్ల, ఏప్రిల్ 17: ఉమ్మడి కులకచర్ల మండలానికి 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరైనటు ఏవో వీరస్వామి బుధవారం పేర్కొన్నారు. ఇప్పాయిపల్లి, బండవెల్కిచర్ల, కులకచర్ల, సాల్వీడ్, ముజాహిద్‌పూర్, చౌడాపూర్, కులకచర్ల, కుసుమ సముద్రం, తిరుమలపూర్, బండవెల్కిచర్ల, మరికల్, చౌడాపూర్, అడవివెంకటాపూర్, మల్కాపూర్, కల్మన్‌కాల్వ, అనంతసాగర్, చాకల్‌పల్లి, ముజాహిద్‌పూర్ గ్రామాలకు కొనుగోలు కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు.



యాలాల మండలం జుంటుపల్లిలో సీతారాముల కళ్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

నీలాకాశమే రంగుల పందిరిగా.. మెరిసే నక్షత్రాలే ముత్యాలుగా.. ఏకపత్నీవ్రతుడు.. పితృవాక్య పాలనాదక్షుడు.. అఖిలాండ కోటి బ్రహ్మండ నాయకుడు శ్రీ సీతారాముల కల్యాణం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో బుధవారం వైభవంగా జరుపుకున్నారు. ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి.. వాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకొచ్చి భక్తుల జయజయధ్వానాల మధ్య సీతారాముల పరిణయాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధంమ రాముల వారు సీతమ్మకు మాంగల్యధారణ గావించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పలు ఆలయాల్లో సకలగుణాభి రాముడు-సౌందర్యవతి సీతాదేవి కల్యాణ మహోత్సవంలో ప్రముఖులు పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చారు.

- అంధ్రజ్యోతి, మేడ్చల్/ వికారాబాద్, ఏప్రిల్17

కల్యాణ..వైభోగమే

» కనుల పండువగా సీతారాముల కల్యాణ మహోత్సవం » భక్తులతో ఆలయాల కిటకిట



కీసరలో రాములోరి కల్యాణం నిర్వహిసున్న పండితులు



బొంరాస్‌పేటలో స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు

'ఎత్తిపోతల'పై లైడర్ సర్వే

» 'కొడంగల్-నారాయణపేట' పథకంతో లక్ష ఎకరాలకు సాగు నీరు

కొడంగల్/వికారాబాద్, ఏప్రిల్ 17: కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం సర్వే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు గ్రౌండ్ లెవల్‌లో కాలువల తవ్వకం, పొలాలకు సాగునీరు అందే విధానంపై సర్వే నిర్వహించారు. తాజాగాగురువారం నుంచి కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం సర్వే కోసం హెలిప్యాడ్ ద్వారా పది రోజుల పాటు లైడర్ సర్వే చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన హెలికాప్టర్ వికారాబాద్‌కు బుధవారం వచ్చింది. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్వే పనుల కోసం రూ.18కోట్లు విడుదల చేశారు. దీంతో ఇప్పటి వరకు గ్రౌండ్ లెవల్‌లో పొలాలకు సాగునీరందే విధంగా సర్వే చేపట్టారు. జూరాల బ్యాక్ వాటర్ నుంచి మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లోని చెరువులను నింపుతూ కొడంగల్ మండలం బాలంపేట, కొడంగల్, హస్నాబాద్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలంలోని కాకరవాణి ప్రాజెక్టుల్లో నీటితో నీరందించేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రౌండ్ లెవల్‌లో కొనసాగుతున్న సర్వే పనులు తుది దశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎత్తిపోతల పథకం పూర్తయితే కొడంగల్ ప్రాంతంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. బోరుబావుల్లో నీటిమట్టం పెరిగి సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లైడర్ సర్వే గురువారం నుంచి పది రోజుల పాటు హెలిక్యాప్టర్ ద్వారా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం అయినట్లు తెలుస్తోంది.



వికారాబాద్‌కు వచ్చిన హెలిక్యాప్టర్

కలిసొచ్చిన ఆలస్యం!

పార్లమెంట్ ఎన్నికలతో 'స్థానిక సమరం' లేటు

- » జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సర్కార్ ప్రకటన
- » దీంతో లెక్కలు చెప్పని అభ్యర్థులకు కలిసొచ్చిన కాలం
- » స్థానిక ఎన్నికల ఆలస్యంతో అనర్హత వేటు నుంచి ఉపశమనం
- » గత స్థానిక పోరులో లెక్కలు చెప్పని అభ్యర్థుల్లో పట్టరాని ఆనందం

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో లెక్కలు చెప్పని అభ్యర్థులకు పార్లమెంటు ఎన్నికలతో కలిసొచ్చింది. లోక్‌సభ ఎన్నికల కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతున్నాయి. ఈ ఎన్నికలను జూన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే 2019లో స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చులకు సంబంధించి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీలు లెక్కలు చూపకపోవడంతో ఉమ్మడి జిల్లాలో అనేక మంది అభ్యర్థులపై ఎన్నికల సంఘం వేటు వేసింది. వారిపై అనర్హత వేటు గడువు జూన్‌లోపే ముగియనుంది. దీంతో వేటు పడిన వారందరిలో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. ఎగిరి గంతులేస్తున్నారు. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఆలస్యం అమృతం.. విషం.. అనే సామెత గుర్తుందా! ఆలస్యం చేస్తే అమృతం కూడా విషమవుతుందనేది దీని అర్థం. అయితే రాజకీయాలకు కొన్ని లెక్కలు, సామెతలు పూర్తిగా అతకవు అనడానికి ఇదో సాక్ష్యం. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో లెక్కలు చెప్పని అభ్యర్థులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్న విషయం విదితమే. వీరందరూ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేసింది. అయితే పార్లమెంట్ ఎన్నికల కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను జూన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అనర్హత వేటు పడిన వారందరిలో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. దీని కారణం వారిపై అనర్హత వేటుకు గడువు జూన్‌లోగానే ముగియనుండడమే. 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో లెక్కలు చూపని కారణంగా ఉమ్మడి జిల్లాలో వేలాది మంది అభ్యర్థులపై ఎన్నికల సంఘం వేటు వేసింది. పంచాయతీ పాలవర్గాల పదవీ కాలం గత ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. అయితే సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన తీసుకొచ్చారు. అలాగే ఎంపీటీసీ, జడ్పీటీసీ పాలవర్గాల గడువు కూడా జూన్ 3, 4 తేదీల్లో ముగియనున్నాయి. ఎంపీటీసీలకు జూన్ 3వ తేదీన, జడ్పీటీసీలకు జూన్ 4వ తేదీన పదవీ కాలం ముగియనుంది. ఇదిలా ఉంటే 2019 జనవరిలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగగా మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. అయితే గత ఎన్నికల సమయంలో ప్రచారానికి సంబంధించిన లెక్కలు సరిగా చూపించకపోవడంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ వేటు వేసింది.

అనర్హత వేటు పడిన అభ్యర్థుల వివరాలు

జిల్లా	సర్పంచులు	వార్డుసభ్యులు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు
రంగారెడ్డి	283	3208	183	18
వికారాబాద్	238	1802	191	26
మేడ్చల్	45	489	32	01
మొత్తం	566	5499	406	45

లెక్కలు చూపని అభ్యర్థులు

ఉమ్మడి జిల్లాలో పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో 6,516 మంది అభ్యర్థులు గత ఎన్నికల లెక్కలు సరిగా చూపించలేదు. నూతన పంచాయతీరాజ్ చట్టం- 2019 ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ప్రతి పైసాకు లెక్కచూపాల్సిందే. ఎన్నికల ఫలితాలు వెలువడిన 45రోజుల్లో అభ్యర్థులందరూ ఖర్చుల వివరాలను అధికారులకు అందచేయాలి. ఎన్నికల్లో ప్రచారానికి ఎంత ఖర్చు చేశారనే వివరాలను అభ్యర్థులు నిర్దేశిత నమూనాల్లో ఎంపీడీవోలకు కొందరు అందజేయగా, మరికొందరు ఇవ్వలేదు. అవగాహన లేక కొందరు...ఇతరాత్ర కారణాల వల్ల మరికొందరు అసలు లెక్కలు చూపలేదు. దీంతో 2021లోనే అలాంటి వారందరికీ నోటీసులు జారీ చేసి తరువాత అనర్హత వేటు వేశారు. నోటీసులు జారీ చేసిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీచేయకుండా ఆంక్షలు విధించారు. అనర్హత వేటు పడిన సర్పంచులు, వార్డు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ అభ్యర్థులకు మే నెలాఖరు వరకు నిషేధం ఉంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. షెడ్యూల్ ప్రకారం సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడానికి ముందే ఎన్నికలు నిర్వహిస్తే చాల మంది పోటీ చేసే అవకాశం కోల్పోయేవారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలో జూన్‌లో పెడతామని ప్రకటించడంతో అనర్హత వేటు పడిన వారి ఆశలు చిగురించాయి. ఎన్నికల్లో పాల్గొనకుండా తమపై విధించిన నిషేధిత పరిమితి ఈలోగా ముగియనుండడంతో వారు సంతోషపడుతున్నారు. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

» సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు



రికార్డులు తనిఖీ చేస్తున్న అభియాన్ మల్లయ్యభట్టు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17 : విద్యార్థులకు మౌలికసదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు హెచ్చరించారు. ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ అర్బన్ రెసిడెన్సియల్ బాలుర పాఠశాలనుఆయన బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటిసమస్య, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు మల్లయ్యభట్టు దృష్టికి తీసుకొచ్చారు. యూనిఫాంలో నాణ్యత లేదని, దోమల బెడద ఎక్కువగా ఉందని వివరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మెనూప్రకారం భోజనం పెట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని ఆదేశించారు. అర్బన్ పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాదలన్నారు. ఈ కార్యక్రమంలో జీఈసీవో హేమలత, ఎస్‌వో మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్లు

- » రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు
- » భారీ బందోబస్తు.. అభ్యర్థి సహా ఐదుగురికే లోనికి అమనుమతి
- » అభ్యర్థులు అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు తప్పక వెల్లడించాలి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/మేడ్చల్ ఏప్రిల్ 17): లోక్‌సభ ఎన్నికలకు అసలైన ఘట్టం మొదలైంది. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ కానుంది. ఇప్పటికే ప్రచారంలో ముందున్న పార్టీలు, అభ్యర్థులు నామినేషన్లు వేయనున్నారు. ఇందుకు రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆర్వో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్లు తీసుకోరు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతించనున్నారు. అభ్యర్థులు 25ఏళ్లు నిండిన వారై, ఓటు హక్కు కలిగి ఉండాలి. అయితే అతడు/ఆమె పోటీచేసే నియోజకవర్గంలోని ఐదుగురు ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థులు గానీ, వారి ప్రతిపాదకులు గానీ నామినేషన్ దాఖలు చేయొచ్చు. నామినేషన్‌తో పాటు అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతలకు సంబంధించిన అఫిడవిట్లు సమార్పించాలి. ప్రతీ అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేస్తారు. నామినేషన్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అయితే అన్నింటికీ కలిపి డిపాజిట్ డబ్బు ఒకసారి చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో 100 మీటర్ల పరిధిలో మూడు వాహనాలనే అనుమతిస్తారు. నామినేషన్ల దాఖలు నుంచి అభ్యర్థుల ఖర్చు లెక్కించనున్నారు. పత్రికల్లో ప్రకటనలు, పెయిడ్ న్యూస్, ఇతర ఖర్చులు అభ్యర్థి ఖర్చు కింద వేస్తారు. ఐటీ, జీఎస్టీ, బ్యాంకింగ్, ఎంసీఎంసీ, ఎక్సైజ్ తదితర జాబితాలను పరిశీలిస్తారు. వ్యయాలను నమోదు చేసి ఎన్నికల పరిశీలనకు వచ్చే వ్యయ పరిశీలకులకు ఎప్పటికప్పుడు నివేదిక అందజేస్తారు. ఇప్పటికే ఓటరు జాబితా సవరణ, పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. నామినేషన్ కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎండలు దంచి కొడుతుండటంతో నామినేషన్ కేంద్రం వద్ద ఆచ్ఛాదనగా ఉండేలా టెంట్లు వేశారు. ప్రతీ లోక్‌సభ అభ్యర్థి గరిష్ఠంగా రూ.95లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు రూ.10వేల వరకు మాత్రమే క్యాష్ రూపంలో ఖర్చు చేయవచ్చు. అంతకన్నా ఎక్కువ ఖర్చు పెడితే చెక్‌రూపంలో లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.



ఏర్పాట్లపై చర్చిస్తున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్, డీసీపీ నితికపంతు

మేడ్చల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ కార్యాలయం

మేడ్చల్ కలెక్టరేట్‌లో ఈనెల 18(నేటి) నుంచి 25 వరకు మల్కాజిగిరి స్థానంలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రధాన ద్వారం నుంచే భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు. బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి(కలెక్టర్) చాంబర్ నుంచి 100 నుంచి 300మీటర్ల వరకు పోలీసు బలగాల పహారాతో మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. సందర్శకులకు మధ్యాహ్నం 3 తర్వాతే అనుమతి ఉంటుంది. నామినేషన్ల స్వీకరణలో ఘర్షణలు, అల్లర్లకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అభ్యర్థుల ర్యాలీలను రెండు వందల మీటర్ల లోపు నిలిపివేయనున్నారు. మూడు వాహనాలను వంద మీటర్ల వరకు, అక్కడి నుంచి అభ్యర్థితో పాటు మరో నలుగురిని లోనికి అనుమతిస్తారు. ప్రతీ అంశాన్నీ వీడియో చిత్రీకరణ చేస్తారు. కలెక్టరేట్ రెండో బ్లాక్ నుంచి ఉద్యోగులను విధులకు అనుమతిస్తారు.

పరిగి, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల భద్రతలో భాగంగా పరిగిలో విధులు నిర్వహిస్తున్న ఎ/46 రామ్ అధోక్-601 ఐటీబీపీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సందీప్‌కలాల్ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని శ్రీకృష్ణ బాలుర హాస్టల్‌లో నవరాత్రి హవన్ పూజన్ బంధరా కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంతో పాటు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, అధికారులు సహపంక్తి భోజనం చేశారు.

ఘనంగా 'హవన్ పూజన్ బంధరా'


హోమంలో పాలొన్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్

మక్సూద్ కుటుంబానికి అధికారుల పరామర్శ

మర్పల్లి, ఏప్రిల్ 17: మక్సూద్ కుటుంబానికి తమ వంతు ఆర్థికసాయం అందజేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ జయరాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మక్సూద్ (28) గ్రామంలో మెకానిక్ వర్క్‌షాప్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందేవాడు. ఈనెల 12న షాపు వద్ద వాహనాలను వాషింగ్ చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో కుప్పకూలిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఈ జయరాజు, ఏడీ సత్యనారాయణ, డీఈ సంజీవ్, ఏఈ రాంచందర్ బుధవారం మక్సూద్ కుటుంబాన్ని పరామర్శించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.


మక్సూద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

ఓబీసీ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వీరేశం



బంట్వారం, ఏప్రిల్ 17 : ఓబీసీ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వీరేశం ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, స్పీకర్ ప్రసాద్ కుమార్, ఓబీసీ సెల్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేసారు.

కేంద్ర పథకాలే విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తాయి



మర్పల్లి : కోటమర్పల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



తాండూరు: మరికంబ కాలనీలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

మర్పల్లి, ఏప్రిల్ 17: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కేంద్ర ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయని బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కోటమర్పల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, నాయకులు శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, సంతోష్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకల్లో కొండా తనయుడు

వికారాబాద్/ధారూరు : చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి ధారూరు మండల పరిధిలోని ధారూరు, నాగారం, స్టేషన్ ధారూరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా వికారాబాద్‌లోని రామాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాములోరికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనవెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు పాండుగౌడ్, విశ్వనాథం, రమేశ్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, రాజునాయక్, నందు, సాయిగౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



వికారాబాద్ : రామాలయంలో జరిగిన కల్యాణంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న విశ్వజిత్‌రెడ్డి

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

తాండూరు/యాలాల : ప్రతీ ఒక్కరు శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని, దేశంలో మోదీ నాయకత్వంలో కొనసాగుతున్న రామరాజ్యం చేవెళ్ల ప్రాంతంలోను రావాలని కొండా సంగీతా రెడ్డి ఆకాంక్షించారు. తాండూరు పట్టణంలోని మరికాంబ కాలనీ, సీసీఐ కాలనీల్లో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తాండూరు పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా యాలాల మండలం జుంటుపల్లి రామస్వామిని సంగీతారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని దేవుడిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.

సీతారాముల కల్యాణంలో పాల్గొన్న విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 17 : షాబాద్ మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్కూడలోని అమ్మపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి సంగీతారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు

మోదీపై అభిమానంతో..

- వధూవరులను ఆశీర్వదించడంతో పాటు మోదీకి ఓటేయాలంటూ ముద్రించిన పెళ్లి పత్రిక

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో ఓ వ్యక్తి ప్రధాని మోదీపై తన అభిమానాన్ని చాటుకున్నాడు. మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు సోదరుడి కొడుకు పెళ్లి ఈనెల 19న జరగనుంది. తన ఇంట్లో జరుగుతున్న వివాహానికి సంబంధించిన పత్రికలు ముద్రించారు. అయితే ఆహ్వానితులకు అందజేసే ఆ పత్రికల్లో ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను ముద్రించి మా పెళ్లికి మీరు ఇచ్చే బహుమతి 'మోదీ గారికి ఓటేయండి' అంటూ ముద్రించిన పత్రిక ఆకర్షణీయంగా...చర్చనీయాంశంగా మారింది. ఆ పత్రికలను సన్నిహితులు, మిత్రులు, ఆప్తులకు అందజేశారు. అంతేకాకుడా సామాజిక మాధ్యమాల ద్వార పోస్టు చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు.



మోదీకి ఓటు వేయమని ముద్రించిన పెళ్లి పత్రిక

ఘనంగా రాములోరి కల్యాణం

- పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి.. ప్రత్యేక పూజలు

పరిగి/యాలాల, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీరామమందిరంలోని పోస్టాఫీసు, బహార్‌పేట్ హనుమాన్ దేవాలయాల్లో అర్చకులు సీతారాముల కల్యాణం వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిపించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పరిగిలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా యాలాల మండల పరిధిలోని జుంటుపల్లిలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. వేద పండితులు, భాజాభజంత్రీల మధ్య కొనసాగిన కల్యాణ మహోత్సవం కనుల పండుగగా కొనసాగింది. కల్యాణ మహోత్సవంలో ఎంపీ రంజిత్ రెడ్డి పాల్గొని ప్రత్యేకంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



యాలాల : జుంటుపల్లి రామస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అమ్మపల్లిలో స్పీకర్, ఎంపీ ప్రత్యేక పూజలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని నర్కూడ అమ్మపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, తెలంగాణ డైరీ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ ప్రధాన కార్యదర్శి లలిత్ మల్రి, ప్రవీణ్‌రావు, మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, గడ్డం విజయ, ఎంపీటీసీ గౌతమిఅశోక్, రవినాయక్, శ్రీధర్, శేఖర్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, జగన్నాథం, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ మెంబర్ గడ్డం సీతా రంజిత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, మల్లేష్, ఆలయ ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి : దాసాంజనేయస్వామికి పూజలు చేస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



అమ్మపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



సీతారాంపూర్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న టీటీడీ మెంబర్ గడ్డం సీతారంజిత్‌రెడ్డి తదితరులు


వికారాబాద్ : రామాలయంలో నిర్వహించిన కల్యాణంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి, మాధవరెడ్డి


కీసర : కీసరగుట్టలో శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పరిగి : కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు


తాండూరు : పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి


ఘట్‌కేసర్ : కల్యాణంలో పాల్గొన్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం

శ్రీరామ నవమిని పురస్కరించుకొని వికారాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ఆలయాలు రామనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. అర్చకులు వేదమంత్రాలు, భాజా భజంత్రీల నడుమ కల్యాణం జరిపించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్ : రాఘవేంద్రనగర్ కాలనీలో నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు


శామీర్‌పేట : బొమ్మరాశిపేటలో బొమ్మరాశిపేటలో శ్రీభవానిరామలింగేశ్వర్ స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నక్క ప్రభాకర్‌గౌడ్


కీసర రూరల్ : నాగారంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి


దౌల్తాబాద్: యాంకిలో సీతారాములు కల్యాణం


బషీరాబాద్ : ఎక్మాయిలో నిర్వహించిన కల్యాణంలో భక్తులు, నాయకులు


దోమ: ఉత్సవమూర్తులతో భక్తులు


ఘట్‌కేసర్ : అన్నోజిగూడలో కల్యాణంలో పాల్గొన్న మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డి, వజ్రేష్ యాదవ్ తదితరులు


తాండూరు రూరల్ : బెల్కటూర్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, తదితరులు


తాండూరు రూరల్ : కరన్‌కోట్ హనుమాన్ ఆలయంలో కల్యాణం.. పాల్గొన్న భక్తులు


యాలాల : జుంటుపల్లి రామస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న శుభ ప్రదీప్‌పటేల్


వికారాబాద్ : అనంతగిరిలో భక్తులకు తాళిని చూపిస్తున్న పండితుడు


కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్‌లో కల్యాణం జరిపిస్తున్న దంపతులు


మూడుచింతలపల్లి : లక్ష్మాపూర్‌లోని రాములగుట్టలో భక్తులకు తాళిని చూపిస్తున్న అర్చకుడు


వికారాబాద్ : నవాబుపేట మండలం అక్నాపూర్‌లో కల్యాణంలో ప్రజాప్రతినిధులు


ధారూరు : ధారూరులో సీతారాముల విగ్రహాలను పల్లకీలో తీసుకెళ్తున్న భక్తులు


మోమిన్‌పేట్: టేకులపల్లిలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


పూడూరు : సరిగాయిపల్లిలో కల్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెంటయ్య, తదితరులు


పెద్దేముల్ : కందనెల్లి తండాలో జాగో బంజారా సమాజ్ ఆధ్వర్యంలో వేడుకలు


వికారాబాద్ : గొట్టిముక్కలో నిర్వహించిన కల్యాణంలో తాళిని చూపిస్తున్న అర్చకుడు


కులకచర్ల : పూజల్లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


పరిగి : కల్యాణంలో పాల్గొన్న మహిళలు


ఘట్‌కేసర్ రూరల్ : ఎదులాబాద్ సీతారామచంద్రస్వామి ఆలయంలో కల్యాణం


బంట్వారం : సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న యాచారం గ్రామస్తులు

సివిల్ ర్యాంకర్‌కు అభినందనల వెల్లువ


తరుణ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, పీఆర్టీయూ ప్రతినిధులు

పరిగి/పూడూరు, ఏప్రిల్ 17: యూపీఎస్సీ నిర్వహించిన జాతీయ స్థాయి సివిల్స్ పరీక్షలో 231వ ర్యాంకు సాధించిన తరుణ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. పూడూరు మండలం మంచన్‌పల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన తరుణ్ తొలి ప్రయత్నంలోనే మెరుగైన ర్యాంకు సాధించారు. ఈమేరకు బుధవారం పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, తదితరులతో పాటు వివిధ ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరిగి ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, జీహెచ్ఎంలు అంజిలయ్య, బుగ్గయ్య, నాయకులు లక్నపూర్ శ్రీనివాస్, బిచ్చన్న, వెంకటయ్య, నర్సింహరాజు, కృష్ణ, రాజేందర్, లాలయ్య, నరేందర్, సుధాకర్, నర్సింహులు, కరుణాకర్, గంగాధర్, ఆంజనేయులు, భీమయ్య, నవీన్ తదితరులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా తరుణ్ మట్టిలో మాణిక్యమని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ అమర్‌నాథ్ అన్నారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో తరుణ్ నివాసానికి వెళ్లి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టి.వెంకటయ్య, ఉపాధ్యక్షుడు మధుసూదన్, పూడూరు మండల శాఖ అధ్యక్షుడు జహంగీర్, ప్రధాన కార్యదర్శి అంజిలయ్య, పరిగి మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పరిగి బస్‌స్టేషన్‌లో చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం కరుణశ్రీ

పరిగి, ఏప్రిల్ 17: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ అన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పరిగి బస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. సమితి కన్వీనర్ అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

హస్నాబాద్‌లో అంబలి కేంద్రం ప్రారంభం



కొడంగల్ రూరల్, ఏప్రిల్ 17: హస్నాబాద్‌లోని వీరభద్రేశ్వరస్వామి ఆలయం ఆవరణలో రిటైర్డ్ ఎంఈవో లక్ష్మీనర్సయ్య, సురేశ్‌గౌడ్, నర్సన్‌గౌడ్, నారాయణగౌడ్, వెంకటయ్యలు అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. సాయిరాం, భజన మండలి సభ్యులు తదితరులున్నారు.

ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17 : వైద్య వృత్తిలో ఎలాంటి అనుభవం లేకున్నా ఎంబీబీఎస్ డాక్టర్లమంటూ రోగులకు వైద్యం అందిస్తున్న ఇద్దరు నకిలీ డాక్టర్లపై పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజు వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపల్, నారపల్లి-కొర్రెముల రోడ్డులో అనుభవం లేకున్నా ఎంబీబీఎస్ డాక్టర్లమంటూ ఆర్ఆర్ క్లినిక్ నడుపుతున్న రవీందర్‌రెడ్డి, డీబీఎం క్లినిక్ నడుపుతున్న నరేందర్‌లపై రాష్ట్ర వైద్య మండలి రిజిస్ట్రార్ డాక్టర్ హనుమంత్‌రావు, టీఎస్ వీసీ విజిలెన్స్ అధికారులతో కలిసి బుధవారం దాడి చేశారు. ఎంబీబీఎస్ డాక్టర్లమని చెప్పుకుంటూ రోగులకు ట్రీట్‌మెంట్ అందిస్తున్నట్లు వారు గుర్తించారు. కనీస అర్హతలు లేకుండానే రోగులకు చికిత్స చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్న అధికారులు తెలిపారు. ఎంబీబీఎస్ సర్టిఫికెట్లు లేకుండానే క్లినిక్‌లు నడపుతూ ప్రజల వద్ద డబ్బులు దండుకుంటున్నట్లు తెలిపారు. ఈమేరకు ఇద్దరిపై పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో రాష్ట్ర వైద్యమండలి అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

దోమ : లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి 50వేల మెజారిటీ వస్తుందని గొప్పలు చెప్పుకుంటున్నారని, అదే జరిగితే తాను గ్రామంలోని బోనమ్మ ఆలయం దగ్గర ముక్కు నేలకు రాస్తానని, కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ రాకపోతే ఎమ్మెల్యే ఏ ఆలయం దగ్గర ముక్కు నేలకు రాస్తారని కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శరత్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. దోమ మండలంలోని మోత్కూర్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రాధేయపడితే కాంగ్రెస్‌లో చేరానన్నారు. మాయ మాటలు చెప్పి, పార్టీలో పదవులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఎలాంటి పదవులు లేవని చెబుతున్నారని అన్నారు.

శామీర్‌పేట : మజీద్‌పూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన తుంకి రమేశ్ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు సహకరించాలని కోరారు. ఆలయాల అభివృద్ధితో ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని తెలిపారు.

క్రైం కార్నర్

వరకట్న వేధింపులకు నవవధువు బలి

పరిగి, ఏప్రిల్ 17: అదనపు కట్నం తేవాలని భర్త, అత్తింటివారి బంధువులు వేధించడంతో విసిగిపోయిన ఓ నవ వధువు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని నస్కల్‌కు చెందిన గౌస్, జైనాబేగం దంపతుల కుమార్తె షహీనాబేగం(24)ను, పూడూరు మండలం గొంగుపల్లికి చెందిన ఎండీ యూసుఫ్, సకినబీ దంపతుల కుమారుడు రఫీతో ఈ యేడాది ఫిబ్రవరి 5న వివాహం జరిపించారు. కట్నకానుకలుగా 8 తులాల బంగారం, వెండి, నగదు, సామగ్రితో కలిపి మొత్తం రూ.16 లక్షలు వరకు ఇచ్చారు. వారి దాంపత్య జీవితం రెండు నెలలు గడవకముందే వేధింపులు మొదలయ్యాయి. షహీనాబేగం పెళ్లైన తర్వాత రెండుసార్లు తల్లిగారి ఇంటికి వచ్చి వెళ్ళింది. ఈక్రమంలో అదనంగా ఇస్తామన్న రూ.2లక్షల కట్నం తీసుకు రమ్మని భర్త రఫీతో పాటు అత్తామామలు, వారి బంధువులు మహబూబీ, తదితరులు వేధించారు. తనను ఎందుకు వేధిస్తున్నారని షహీనా కుటుంబ సభ్యులు, బంధువులు వారిని నిలదీశారు. పంచాయితీ పెట్టి మాట్లాడదామని ఒప్పుకున్నారు. అయితే, ఈనెల 12న రఫీ, షహీనాబేగంను నస్కల్‌లో వదిలివెళ్లారు. సోమవారం రాత్రి ఇంటి పైకి(దాబా) వెళ్ళి చదువుకుటానని చెప్పిన షహీనా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి జైనాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కులకచర్ల, ఏప్రిల్ 17: ఆర్థిక ఇబ్బందులతో క్రిమిసంహారక మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వీరాపూర్‌కు చెందిన యువకుడు రెబ్బన మోని శ్రీనివాస్(37) మద్యానికి బానిసయ్యాడు. దాంతో తెలిసిన వారి వద్ద అప్పు చేశాడు. మార్చి 14న సాయంత్రం అతని కుమారుడు రాజుకు ఫోన్‌చేసి అప్పులు అధికమయ్యాయని క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతకగా రైతు బాలకిష్టయ్య పొలంలో గుర్తించి వెంటనే పాలమూర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యశీలారెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 17 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియన మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డబీల్‌పూర్ శివార్లలోని ఓ వెంచర్‌లో స్థానికులకు బుధవారం కుళ్లిపోయిన మహిళ మృతదేహం కనబడటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేయగా మహిళ శరీరం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టని విధంగా ఉంది. మృతురాలి వయసు సుమారు 40-45 మధ్య ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న పశువులు పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17 : పశువులను కబేళాకు తరలిస్తున్న కంటైనర్‌ను అదుపులోకి తీసుకొని నలుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి ఎదులాబాద్‌లో రోడ్డులో బుధవార ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో బీబీనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కంటైనర్‌ను తనిఖీ చేశారు. అందులో తాళ్లతో క్రూరంగా కట్టేసిన 80 పశువులను గుర్తించారు. 36 ఎద్దులు, 44 ఆవులలో ఒక ఆవు మృతిచెందింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగేరు గ్రామానికి చెందిన డ్రైవర్ షామీమ్ అహ్మద్‌ను విచారించగా, ఒడిస్సాలోని సంతలో సబావత్ విజయ్‌కుమార్ 80 పశువులను కొనుగోలు చేసి హైదరబాద్‌లోని బహదూర్‌పుర కబేళాకు కంటైనర్‌లో తరలిస్తున్నట్లు తెలిపారు. కాగా, కంటైనర్‌లో డ్రైవర్ షామీ అహ్మద్‌తో పాటు మరో డ్రైవర్ సాజిద్ అక్కడి నుంచి తప్పించుకోగా కూలీపని చేసే గంగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పశువులను గోశాలకు తరలించి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న సాజిద్‌ను, సబావత్ విజయ్‌కుమార్‌లను త్వరలో అరెస్టు చేసి తీసుకోని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, బియ్యంను స్వాధీనం చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం, మార్క్యాపురంనకు చెందిన భూక్యా రాజేందర్ ఘట్‌కేసర్ పరిసర ప్రాంతంలో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తుంటాడు. ఆ బియ్యాన్ని ఇటుక బట్టీలు, కోళ్ళ ఫారాలలో పనిచేసే కూలీలకు ఎక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపల్, శివారెడ్డిగూడ వద్ద 25 క్వింటాళ్ళ రేషన్ బియ్యం కొనుగోలు చేసి అశోక్ లేల్యాండ్ వాహనంలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. రాజేందర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.